క్లుప్తంగా

ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మార్కాపురం: పట్టణంలోని ఏకలవ్య కాలనీ శాంతినగర్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేక పోవడంతో ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటి వీధినుంచి 4వ వీధి వరకూ ప్రతిరోజూ చిన్నారులు ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి పాఠశాలలకు వెళ్తుంటారు. దీనితో తెలియక పిల్లలు ఎవరైనా ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుంటే అంతే సంగతులు. పశువులు, మేకల యజమానులు కూడా రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి తమ జీవాలను తోలుకుని వెళ్లేప్పుడు అతి జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు తురిమెళ్ల విద్యార్థులు



కంభం: రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు తురిమెళ్ల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు సంతోష్ రెడ్డి, వీరశేఖర్, మేఘన, నాగార్జునరెడ్డి, ఉమాదేవిలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోనీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. స్కూల్‌గేమ్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలు ఒంగోలులో నిర్వహించారన్నారు. ఈపోటీల్లో కళాశాలకు చెందిన ఐదు మంది విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


నర్సరీ నిర్వాహకుడికి వివరాలు తెలుపుతున్న హెచ్‌ఓ రమేష్

మార్కాపురం: నర్సరీల నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని మార్కాపురం ఉద్యానశాఖాధికారి డి రమేష్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని నికరంపల్లి, పెద్దయాచవరం గ్రామాల్లో మిరపనారు పెంచే షెడ్‌నెట్ నర్సరీలను పరిశీలించి నర్సరీ యాక్టు 2010 గురించి తెలిపారు. యజమానులు నారు కొనే రైతులకు సాగుచేసే విత్తనం ఆధారాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. గుర్తింపు పొందిన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు తీసుకోవాలన్నారు. నారు కొనే ప్రతి రైతుకూ వివరాలతో రసీదును తప్పనిసరిగా ఇవ్వాలని, మొలకశాతం, చివరి తేదీ వివరాలన్నీ రసీదులో నమోదుచేయాలని తెలిపారు.

గ్రంథాలయ పరిసరాలు శుభ్రంగా ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న శివారెడ్డి

రాచర్ల: గ్రంథాలయాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాచర్లలోని శాఖా గ్రంథాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాచర్ల గ్రంథపాలకుడు కె.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు పాల సమాజం

దొనకొండ: స్థానిక ఏబీఎం చర్చిలో శనివారం ఉదయం 10 గంటలకు పాల సమాజం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్శి నియోజకవర్గంలోని 5 మండలాల పాస్టర్లు, సంఘ పెద్దల ఆత్మీయ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. ప్రేమతో విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తెల్లబంగారం ఆదుకునేనా.. !

- పత్తి దిగుబడులపైనే రైతుల ఆశలు
- సబ్‌డివిజన్‌లో సుమారు 7 వేల హెక్టార్లలో వివిధ పంటల సాగు
- 3,788 హెక్టార్లలో పత్తి సాగు
- క్వింటాకు రూ.8 వేల నుంచి 10 వేలు ఇవ్వాలని రైతన్నల డిమాండ్


సాగుచేసిన పత్తి

మార్కాపురం: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులు పత్తి దిగుబడులపైనే ఆశలు పెంచుకున్నారు. మార్కాపురం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. గత ఏడాది మిర్చి సాగుచేసిన రైతులు నష్టాలపాలు కావడంతో ఈ ఏడాది పత్తి సాగుపైన దృష్టిపెట్టారు. మార్కాపురం వ్యవసాయ సబ్‌డివిజన్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 3,788 హెక్టార్లలో పత్తి సాగుచేశారు. కంది 869 హెక్టార్లలో, వరి 181 హెక్టార్లలో, మొక్కజొన్న 218 హెక్టార్లలో, సజ్జ 70 హెక్టార్లలో, నూగులు 112 హెక్టార్లలో, ఆముదం 117 హెక్టార్లలో సాగుచేశారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలకు ప్రాణం పోసినట్లయింది. ఈనెల 1నుంచి 20వ తేదీ వరకూ తేలిక పాటి వర్షాలు కురిశాయి. అవి ఏమాత్రం పంటలకు ఉపయోగ పడలేదు. ఎండిపోయే దశలో ఉన్న నేపథ్యంలో మూడు రోజులుగా కురిసిన వర్షాలతో జీవం పోసుకున్నాయి. సబ్‌డివిజన్ వ్యాప్తంగా సుమారు 7 వేల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి.

మార్కాపురం సబ్‌డివిజన్‌లో పంటల సాగు ఖరీఫ్ సీజన్‌లో ఇలా..

మండలం	సాగు హెక్టార్లలో
మార్కాపురం	2312.61
తర్లుపాడు	600
పెద్దారవీడు	2120
కంభం	850
అర్ధవీడు	1150

పత్తి దిగుబడులపైనే ఆశలు..

ఈ ఏడాది పత్తిసాగుపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఎకరాకు సుమారు రూ.25 నుంచి రూ.30 వేల వరకూ ఖర్చు వచ్చింది. మార్కాపురం మండలంలోని చింతగుంట్ల, జమ్మనపల్లి, కోల భీమునిపాడు, వేములకోట, నికరంపల్లి, బొడిచర్ల, మిట్టమీదిపల్లి తదితర గ్రామాల్లో, తర్లుపాడు, పెద్దారవీడు మండలంలోని పలు గ్రామాల్లో పత్తి సాగుచేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా పత్తి ధర రూ.5 వేల నుంచి రూ.5500 మధ్యన ఉంది. వేసవిలో సాగుచేసిన (ముంగారి) పత్తి కాపుకొస్తోంది. మరో వారం పదిరోజుల్లో పత్తి మొదటికోతలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఎకరాకు మొదటి కోతలోనే కనీసం 5 నుంచి 7 క్వింటాళ్ల వరకూ వస్తే బాగుంటుందని ఎదురుచూస్తున్నారు. దీనితోపాటు కంది దిగుబడులపై కూడా రైతులు ఆశతో ఉన్నారు.

గతేడాది పూర్తిగా ముంచిన కూటమి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గతేడాది నుంచి నేటి వరకు రైతులు నష్టాలే తప్పా లాభాలు చూసిన సందర్భాలు లేవు. టమాట, మిర్చి, పొగాకు, శనగ, వేరుశనగ, పత్తి, దోస, వరి, ఇలా ఒకటేమి వేసిన ప్రతి పంటకూ సరైన గిట్టుబాటు అందించడం కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. ఈసారైన దిగుబడి వచ్చిన పత్తి పంటకు క్వింటా రూ.8 వేల నుంచి 10 వేల వరకు గిట్టుబాటు అందించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఎకరన్నర పొలంలో పత్తి సాగుచేశా..



ఈ ఏడాది ఎకరన్నర పొలంలో పత్తిసాగుచేశాను. ఇప్పటివరకైతే పర్వాలేదు. మొదట్లోనే ధర ఎక్కువగా ఉంటే బాగుంటుంది. ఎకరాకు సుమారు విత్తనాలకు, ఎరువులు, సేద్యపు ఖర్చుల కింద రూ.25 వేల దాకా ఖర్చు వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపొలం పర్వాలేదు. ఎకరాకు సుమారు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు వస్తే నష్టం ఉండదు. దిగుబడులు ఎలా వస్తాయో చూడాలి.

– కే పోలిరెడ్డి, పుచ్చకాయలపల్లి

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు


దుకాణంలో స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సై

మార్కాపురం: బాణాసంచా నిల్వచేసే షాపుల యజమానులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పి సుబ్బారావు హెచ్చరించారు. గురువారం వడ్డే బజారులో అనధికారికంగా బాణాసంచా సామగ్రి నిల్వచేసిన ఇంటిని తనిఖీచేసి సుమారు రూ.60 వేల విలువచేసే బాణా సంచాను స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గురువారం ఆయన పట్టణ ఎస్సై సైదుబాబుతో కలిసి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న దీపావళి మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దీపావళి మందులు అమ్మే ప్రాంగణంలో అగ్నిప్రమాద నిరోధక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి షాపు యజమానికి కచ్చితంగా లైసెన్సు ఉండాలన్నారు. బాణా సంచా అమ్మే కేంద్రం వద్ద ఇసుక, నీళ్లు, ఫైర్ అధికారుల ఫోన్ నంబర్లు ఉండాలని చెప్పారు. జనావాసాల మధ్య షాపులు ఏర్పాటు చేయవద్దని, వెంటనే ఊరిబయటకు తరలించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటిస్తూ సహకరించాలని చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న వెదురు స్వాధీనం


పట్టుబడ్డ వెదురు కట్టలు

గిద్దలూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న వెదురు కట్టలను స్థానిక రైల్వేస్టేషన్‌లో గురువారం అటవీశాఖ అధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సంయుక్తంగా కలిసి స్వాధీనం చేసుకున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో నుంచి కొందరు వ్యక్తులు వెదురు కలపను కట్టలుగా కట్టుకుని డోన్ నుంచి గుంటూరుకు వెళ్లే ప్యాసింజర్ రైలులో అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించగా అధికారులు వాటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వెదురు కట్టలను గిద్దలూరు అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. రైలులో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉండేలా వెదురు కట్టలను రైలు బోగీల్లో ఉంచి రవాణా చేయడంపై ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఎన్నిసార్లు వారికి కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుందని ఎస్సై పిచ్చిరెడ్డి తెలిపాడు. అడవి నుంచి వెదురు కలప రైలులో అక్రమంగా తరలివెళుతున్న కర్రలను స్వాధీనం చేసుకుని అటవిశాఖ అధికారులకు అప్పగిస్తున్నామని తెలిపారు.

ఆ భూములపై సర్వహక్కులు ఉన్నాయి


మాట్లాడుతున్న మల్లికార్జున్, పక్కన ఆర్యవైశ్యులు

మార్కాపురం టౌన్: ఆర్యవైశ్యులమైన మాపైన కొందరు అనవసర రాద్ధాంతం చేస్తూ కోర్టులకు, రెవెన్యూ కోర్టులకు తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆర్యవైశ్యులు పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. పట్టణంలోని తర్లుపాడురోడ్డులో గల సుమారు 40 ఎకరాల భూమిని నలుగురు భాగస్తులం కలిసి 2010లో రూ.1 కోటి కొనుగోలు చేశాం.. అయితే ఆర్యవైశ్యులమైన మాపైన కొందరు అనవసర రాద్ధాంతం చేస్తూ కోర్టులకు, రెవెన్యూ కోర్టులకు తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వక్కలగడ్డ మల్లికార్జున్‌తోపాటు భాగస్తులు విలేకరులకు తెలిపారు. 2011లో ఈ భూమిని వైశ్యులు కొనుగోలు చేశారని తెలుసుకున్న కొందరు.. ఈ భూమి మా పూర్వీకులదని మేము సాగు చేసుకుంటున్నామని చెప్తూ డబ్బులు డిమాండ్ చేస్తూ వచ్చారు. అప్పట్లో కొందరి అండదండలతో భూమిని దున్ని సాగులోనికి వచ్చారన్నారు. అయితే వారే హైకోర్టులో పిటీషన్ వేశారని విచారించిన కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అనంతరం రెవెన్యూ కోర్టుకు వెళ్లారని అప్పటి అధికారుల ఆదేశాల మేరకు నాటి తహశీల్దార్‌లు పొలాన్ని, డాక్యుమెంట్లను విచారించి తమకే భూమిపై హక్కు ఉందని నివేదికలు ఇచ్చారన్నారు. ఈ విషయంలో మాకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరామని ఆర్యవైశ్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల విఫలం

- మండల సమావేశంలో ధ్వజమెత్తిన సభ్యులు


ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సమావేశానికి వచ్చిన టీడీపీ నేత శ్రీనివాసరెడ్డి

కొనకనమిట్ల: సమస్యల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపటంలేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి పని చేయాల్సిన అధికారులు ఆదిశగా పనులు చేయడం లేదని సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన ఎంపీడీవో ఈశ్వరమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, గొట్లగట్టు ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో అధికారుల తీరు ఏమాత్రం బాగా లేదని అన్నారు. నాడు–నేడు పనులు ఎక్కడికక్కడ ఆగిపోవటంతో సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తీర్మానాలు లేకుండానే గ్రామాల్లో ఉపాధి హామీ ద్వారా పనులు చేపట్టడంపై ఎంపీటీసీ రామనారాయణరెడ్డి ఆరోపణలు చేశారు. చినారికట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరైన మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎంఈఓ డాంగేషరీఫ్, ఏఓ ప్రకాష్, ఏపీఎం సుధాకర్, ఏపీఓ బుల్లెన్నరావ్, పశువైద్యాధికారి కృష్ణమోహన్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ సుభాషిణితో పాటు పలుశాఖలకు చెందిన అధికారులు తమ ప్రగతిని వివరించారు. సమావేశంలో కో ఆప్షన్ సభ్యులు మధార్‌వలి, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సభ్యులు కాని వారు సమావేశానికి రావడంపై ఆరోపణలు..

మండల సమావేశానికి ఏ అర్హత లేకుండా పలువురు సమావేశంలో కూర్చువడంపై గొట్లగట్టు ఎంపీటీసీ ఉడుముల రామనారాయణరెడ్డి ప్రశ్నించారు. అలాంటివారిని తక్షణమే బయటకు పంపాలని కోరారు. ఎంపీడీవో ఈశ్వరమ్మ స్పందించి సమావేశంలో కూర్చున్న చినారికట్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు డి.శ్రీనివాసరెడ్డిని బయటకు వెళ్లాలని కోరారు. సమావేశంలో ఉండకూడదని ఎంపీడీవో వివరిస్తున్నప్పటికి శ్రీనివాసరెడ్డి ఆవేశంతో ఎంపీడీఓను మీకు మంచి పద్ధతి కాదని బయటకు వెళ్లిపోయారు.

పట్టణంలో గంజాయి, మట్కా దందా


గంజాయిని సీసాలో నింపుకున్న యువకులు

కంభం: పట్టణంలో గంజాయి, మట్కా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. చిన్నపిల్లలు సైతం గంజాయి మత్తుకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం రాత్రి సుమారు 10 మంది యువకులు గంజాయి ఆకును సీసాలో నింపి అందులో నిప్పంటించి పొగను పీల్చుకుంటూ మత్తులో మునిగితేలిపోయారు. గంజాయి మత్తులో తూగుతూ ఆయువకులు తీసుకున్న వీడియో కాస్త బయటకు రావడంతో వైరల్‌గా మారింది. వీరిలో ఎక్కువమంది మైనర్లు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పోలీసులు పలువురు యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పట్టణంలోని అర్బన్ కాలనీ, రైల్వేస్టేషన్ సమీపం, నక్కలగండి సమీపం, హైవే రోడ్డులోని 30 అడుగుల రోడ్డు వద్ద గంజాయి చేతులు మారుతోంది. గంజాయితో పాటు ఆన్‌లైన్ మట్కా సైతం జోరుగా సాగుతుంది. కొందరు మట్కా బుకీలు టీస్టాల్స్, హోటల్స్, లాడ్జీలలో కూర్చొని దందా సాగిస్తున్నారు. హైవే రోడ్డుపై ఉన్న పలు లాడ్జీలు సైతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోతున్నాయి. గతంలో పలుమార్లు లాడ్జీలలో గంజాయి నిందితులు పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. ఇంకా పలువురు యువకులు పట్టణంలో స్పోర్ట్స్ బైక్‌లపై పెద్దపెద్ద శబ్దాలు చేసుకుంటూ విద్యార్థినిలను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై పోలీసులు దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

హామీ ఇవ్వాల్సిన బాధ్యత ఆర్గనైజర్లదే


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సంచాలకులు బాలాజి నాయక్, ఎస్సై

అర్ధవీడు: విత్తనోత్పత్తి చేసే రైతులకు హామీ ఇవ్వాల్సిన బాధ్యత ఆర్గనైజర్లదేనని మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు డీ. బాలాజీ నాయక్ స్పష్టం చేశారు. వివిధ కంపెనీలతో మొక్కజొన్న విత్తనోత్పత్తి చేయిస్తున్న ఆర్గనైజర్లకు, సబ్ ఆర్గనైజర్లకు వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆర్గనైజరులందరూ రైతులకు తప్పనిసరిగా కంపెనీల నుంచి అగ్రిమెంట్లు ఇవ్వాలన్నారు. అలా ఇవ్వని పక్షంలో సంబంధిత ప్రాంతీయ ఆర్గనైజర్‌లు, సబ్‌ఆర్గనైజర్లు బాధ్యత వహించాలని తెలిపారు. మొక్కజొన్న విత్తనాల రేటు, దిగుబడి, ధర విషయంలో రైతులకు క్షుణంగా వివరించి అగ్రిమెంట్లు ఇవ్వాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సై శివ నాంచారయ్య, ఇన్‌చార్జి ఏవో శివగంగాప్రసాద్, క్వాలిటీ కంట్రోలు అధికారి అబ్దుల్ రఫీక్, ఏఏలు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాచర్ల: ఆర్‌డీఎస్ఎస్ పనులు కారణంగా జేపీ చెరువు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా విద్యుత్‌శాఖ డీఈ బీవై.శేషగిరిరావు, ఏఈ బాలగురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జేపీ చెరువు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. అంతేకాక ఆకవీడు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆకవీడు, అరవీటికోట, కోత్తూరు, అచ్చంపేట, చోళ్లవీడు గ్రామాల్లో సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

సురక్ష పథకం చెక్కు అందజేత


చెక్కు అందచేస్తున్న కిరణ్‌కుమార్

మార్కాపురం: వాసవీ కుటుంబ సురక్ష పథకం కింద మంజూరైన రూ.4.03 లక్షల చెక్కును వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ గంగిశెట్టి కిరణ్‌కుమార్ గురువారం పెసల రవికుమార్‌కు అందచేశారు. క్లబ్ మెంబరైన పెసల బాలమ్మ ఇటీవల మరణించడంతో సురక్ష పథకం కింద వచ్చిన చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమాదేవీ, సురేంద్ర, ధనలక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాపై విస్తృత తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

గిద్దలూరు రూరల్: గంజాయి ఇతర మత్తుపదార్థాల రవాణాపై స్థానిక సీఐ కె.సురేష్, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్యల ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, దిగువమెట్ట, పీఆర్ కాలని, అర్బన్ కాలని వంటి ప్రాంతాల్లో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన కుక్కల ఆధారంగా ఆయా ప్రాంతాలల్లో సోదాలు నిర్వహించారు. గంజాయితో పాటుగా ఇతర మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మత్తుపదార్థాలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా అయ్యే అవకాశాలు ఉన్న ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన


మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి

కంభం: గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బి. సుబ్బారావు పాల్గొని పంచాయతీ రికార్డులు, ఆర్టీఐ యాక్ట్, బడ్జెట్, కోర్ట్ కేసులు, ఐవీఆర్ఎస్ కాల్స్, పన్నులు మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, డిప్యూటి ఎంపీడిఓలు విజయలక్ష్మి, జిలానిబాష, వీరరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులే నకిలీ మద్యం పేటెంట్‌దారులు


గౌస్ మొహిద్దీన్

మార్కాపురం: రాష్ట్రంలో తాజాగా పట్టుబడుతున్న కల్తీమద్యం ఘటనల్లో టీడీపీ నేతలే పేటెంటుదారులని తేలిపోయిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీమద్యంతో అమాయక పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని విజ్ఞప్తి చేశారు. కల్తీ మద్యం తయారుచేసే టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీని దూషించడం వింతగా ఉందన్నారు. మద్యం అమ్మకాలను తగ్గించే చర్యలను నాటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకోగా టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు నాడు విమర్శించారని అన్నారు. నేడు రాష్ట్రంలో ఎక్కడ కల్తీమద్యం పట్టుబడుతున్నా దానికి సూత్రధారులు టీడీపీ నేతలేనని బయటపడుతున్న ఘటనలు రుజువు చేస్తున్నాయన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దాత, హెచ్‌ఎం

బేస్తవారిపేట: మండలంలోని పందిళ్లపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు విద్యాసామగ్రిని మోక్షగుండంకు చెందిన సీపీఐ నాయకుడు మందేపల్లి కొండయ్య గురువారం అందజేశారు. 64 మంది విద్యార్థులకు పలకలు, అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత కొండయ్యకు శాలువ, పూలమాలతో ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అద్దంకి రాజశేఖర్, ఉపాధ్యాయులు నాగమల్లి వరప్రసాద్, పీవీ రాజశేఖర్, జీవీ కృష్ణయ్య, అంగన్‌వాడీ కార్యకర్త కే శివలక్ష్మీ పాల్గొన్నారు.

నల్లమలలో జంగిల్ క్లియరెన్స్


మార్జిన్‌లు శుభ్రం చేస్తున్న కూలీలు

పెద్దదోర్నాల:

దేశ ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం పర్యటన ఖరారైన నేపథ్యంలో అధికారులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దీంతో శ్రీశైలానికి ముఖద్వారంగా వెలుగొందుతున్న పెద్దదోర్నాల మండల కేంద్రం నుంచి శ్రీశైల పుణ్య క్షేత్రం వరకు రోడ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఈ నెల 16న దేశ ప్రధాని నరేంద్రమోదీ శ్రీశైలం పర్యటనకు రానున్న నేపథ్యంలో శ్రీశైలం జాతీయ రహదారి 765కు సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. ఇందు కోసం వందల మంది కూలీలు, జేసీబీలతో రోడ్ల మార్జిన్, మార్కింగ్ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. నల్లమల అభయారణ్యంలో గురువారం జంగిల్ క్లియరెన్స్, రోడ్డు మార్కింగ్ పనులు ప్రారంభమయ్యాయి.